వృథాగా తత్త్వము తెలియక నన్ను పొగడు చున్నారు. కానీ, ఇప్పుడుమాత్ర మేమి? నేఁటినుండియు నానడతను మార్చుకొనియెద. భగవత్కైంకర్యములు చేసెద'ననితలంచి యాతఁడు గృహము చేరెను. ఆతని హృదయములో నాఁటినుండియు సంతోషమునకు బదులు వేఱుభావములు పరుగిడఁదొడఁగినవి. కొన్నిదినములు ఆవిధముగానే యాతఁడు ఏదోధ్యానించుచుండెను.

ఈతనిమార్పు బుచ్చమాదేవి కనుంగొనెను. భర్తను ఆతని చిత్తవ్యథకు కారణ మడిగెను. "ఇన్నాళ్లూ నీమెనకాల దిరిగి నిన్నుమెప్పించాలని బాధలుపడ్డా. ఇప్పుడు నాకోసరం బాదలు పడతావున్నా. నా మోస్తరుగా బాదపడ్డావోడూ, దేశాలు తిరిగినవోడూ లేడు. నీకుతెలవంది కాదు గదూ. ఈచేత్తో ఎందర్నోపొడిచినా, ఎన్ని తలకాయలో నరికినా. అంతానీదయకోసమే. అయితే కొన్నాళ్లుగా నా అంతరాత్మ 'దేవుడిదయ దెచ్చుకోకపోతివే, ఈ మానవ జన్మం ఎన్నాళ్లూ' అంటూ మారిపోతావుంది. నువ్వేం అనుకోబాక. కొన్నాళ్లు నిన్నొదిలేశి అట్టా దేవస్థళాలూ, పుణ్యక్షేత్రాలూ తిరిగేశొస్తా" అని భార్యకు తనహృదయావేదనను తెలిపినాఁడు.

బుచ్చమాదేవి నిర్ఘాంత పోయినది. ఆమెకు ఏమియుతోచలేదు. కోపమును, దుఃఖమునుకూడ వచ్చినవి. 'ఏవూళ్లో ఏపల్లెలో ఎవరిని కన్నేశినావో, ఎల్తానంటవు. నేనే నీకంత సులకనగా ఉండానా. దీనికోసమేగా మోసు నువ్వు నన్నినాళ్లూ అబద్దాలుచెప్పి మోసంచెయ్యటం. కానీలే' అని గద్గదికముగా పలికెను.

'కాదేకాదే, ఎంతమాత్రంకాదే. నేను నాహృదయం సుద్దంకావాలని పోతుండానే. దేవుడిదరిసనాలు చేసుకొని, చేశినపాపం కడిగేసుకుంటా. నువ్వు ఏంఅనుకోవద్దు. నామాటవిని సుకంగావుండు. నామణుసుకు నెమ్మది కోరేదాని వౌతే నాకు ఉత్తరవి పోవటానికి.'

'నా ఉత్తరవేమీ ఎల్లేవోడికి....... .. మామా! ఎందుకీతంటాలు నీకంతా బక్తి వైరాగ్యమూ పుట్టితే నువ్వు ఇంటికాడే చదువుకొంటా, చదువుకొన్న అయ్యోర్లనడిగి తెలుసుకొంటూ ఉండిపో. గుడిగోపురాలు కట్టించు. ఈడ వొకదైవం ఆడ వొక దైవంలేదు. ఎందుకు తిప్పలబడతావు.'

'కాదుకాదు. నీకుతెలవదు. నామీంద నీకు నిజంగా మణుసుంటే నా మణుస్సు పరితపిస్తావుంటే నువ్వు సుస్తావుంటావా.'

పాపము, ఆమె ఎన్నిచెప్పినను నాయఁడు బదులు చెప్పచునేయుండెను. ఆతనిని నిలుపుట తనకు సాధ్యముకాదని యామె తలంచెను. తల గిరున తిరుగఁగా నామె పడిపోయెను. ఇంతలో నాయఁడు ఆమెను చేతులలో పట్టుకొని పక్కమీఁద పరుండఁబెట్టెను. పిదప ఎట్లో ఆమెకు బోధించి తాను

